# చలి చెలమ

హమేషా ఊళ్ళు తిరగడమంటే కొందరికి ఇష్టం. నాకూ ఇష్టమే! కానీ ఇష్టమున్నంతమాత్రాన సరిపోయిందా ఏమిటి? వీలుండద్దూ? నాకు లేనిదే అది! కానీ ఈ వీలు సంగతి లోకానికేం పట్టింది? ఏ కార్డు ముక్కో ఏ ఆహ్వాన పత్రమో తాఖీదులా ఇంటికి వస్తుంది. చేత డబ్బుండదు. కాజువల్ లీవు ఉండదు. ఇంటిలో ఎవరికో ఒకరికి ఆరోగ్యం బాగుండదు. ఇవన్నీ అవతలివారి దృష్టిలో కుంటిసాకులు. నూరు ఆరయ్యేది, ఆరు నూరయ్యేది బస్సో, రైలో ఎక్కవలిసిందే!

ఈ మధ్య అలాగే నాకొక ప్రయాణం ఒనగూడింది!

అవసరం బంధుకార్యం.

వెళితే జరిగే మర్యాదలను గురించి మీరు అడగనూ గూడదు, నేను చెప్పనూ గూడదు! కానీ వెళ్ళడం మాత్రం తప్పనిసరి!

భళ్లున తెల్లవారేసరికి సెంట్రల్ స్టేషను చేరుకోవలసిన రైలు ఆరోజు రెండు గంటలు లేటు! గంట ఎనిమిది కాబోతూండగా రైలు దిగాను. మదరాసు నగరం సూర్యోదయాన్ని గానీ, సూర్యాస్తమయాన్ని గానీ కళ్లచూచి నాలుగైదు రోజులయిందన్న విషయం నాకు సెంట్రల్లో రైలు దిగిన తరవాతగానీ తెలియదు. మూసి ముల్లుకొట్టుక పోయినట్టుంది ఆకాశం. పడుతున్న తుంపర చినుకులు ఆగనిమ్మని కాస్సేపు స్టేషనులోనే జాగు చేశానేమో, అంతలోనే కుంభవర్షమే ప్రారంభమయింది. అది గాత్రసంగీతమైతే, డబ్బారేకులది మృదంగంమోత, రోడ్డుపైన బస్సులు పరుగెత్తకపోవడం లేదు. కాని బస్సులని ఎలా అనుకోవడం? అవి సబ్‌మెరీన్లను తలపిస్తున్నాయి. బస్ స్టాపింగు దగ్గిరికి వెళ్ళి నిల్చోవాలన్నా వాన తగ్గాలి. తగ్గే సూచనలు లేవు. ఓ టాక్సీలో జొరబడి రాయపురం అన్నాను. టాక్సీ కదిలింది.

మదరాసు నగరంలో వాన ఎన్నెన్ని రకాలుగా కురుస్తుందనీ! మేడలపైన అందంగా, గుడిసెలపైన భయంకరంగా, వర్క్‌షాపులపైన బీభత్సంగా వీధుల్లో ఒయ్యారంగా కురుస్తుంది వాన. ఆ ఒడుపులు, ఆ విరుపులు, ఆ నడకలు మదరాసువానకే చెల్లుననిపిస్తుంది! మార్గమధ్యంలో ఒకసారి టాక్సీ డ్రయివరు నోరు తెరిచి, "సరియా సొల్లుంగొ సార్! రాయపెట్టా, రాయపురమా?" అన్నాడు. జ్ఞాపకానికి వ్రాసిపెట్టుకున్న కాగితానికీ పాటావేసి మదరాసు మహాటవిలో చూచుకుని రాయపురమే నన్నాను. గమ్యస్థానాన్ని పసిగట్టడంలో వేటకుక్కలవంటివి గదా టాక్సీలు! కానీ ఆ టాక్సీకైనా కాస్త తికమక తప్పింది కాదు. ఈశాన్య తీర్థ ధర్మతోట్టమంటే అక్కడెవరికీ తెలియదు. దాన్ని కర్మాంతరాల తోట అనాలట! తీరా అక్కడికి వెళితే అక్కడున్న కాపలావాడు "కర్మక్రియలకోసం మాత్రమే ఇక్కడి వస్తారు, బాబూ! భోజనాలు అవీ సత్రంలో ఏర్పాటు చేసుకుంటారు" అంటూ నాలుగు వీధుల కవతల ఉన్న సత్రానికి రీడైరక్టు చేశాడు. మళ్ళీ టాక్సీలోనే ఆ సత్రానికి తిరుగు టపా!

తమ ఇండ్లలో వచ్చిన బంధువుల కందరికీ జాగా వుండదని ఇలా ఒక సత్రాన్ని కుదుర్చుకున్నారట! "భోజనాలు సిద్ధమవుతున్నాయి. ఆలోగా కర్మ క్రియలు పూర్తిగావించుకుని వచ్చేద్దాం" అంటూ జట్లుజట్లుగా కర్మాంతరాలతోటకే బయలుదేరారు. పేరుపేరునా పితృదేవతల నందరినీ పలకరించి, ఆ కర్మకాండ అంతా నెరవేర్చేసరికి గంట రెండు కావచ్చింది. సత్రానికి తిరిగి, అక్కడ వరుసగా నాలుగైదు బంతులు భోజనం చేసి లేచేసరికి గంట మూడున్నర. సత్రంలో చెవులు చిల్లులు పడిపోయే సందడి! ఆ సందడికి తట్టుకోలేక అలా బయటికివెళ్ళి కాస్త కాలహరణం చెయ్యడమే నా నేరం! తిరిగివచ్చేసరికి సత్రం ఖాళీ! సత్రాన్ని కనిపెట్టుకుని ఉన్న పనిమనిషి ఒక్కడు మాత్రం కనిపించాడు. "బాబూ! బంధువులందరూ వెళ్ళిపోయారు. ఇక్కడొక సంచీమాత్రమే మిగిలిపోయింది. మీదేమో చూడండి" అన్నాడు.

మా బంధువుల అతిథి సత్కార దీక్షా పరాయణత్వం నాకెంతగానో నచ్చింది. వాళ్ళ గుడుగుడు కుంచాలకు మధ్య, మెరమెచ్చు మాటలకు నడుమ ఒదుగుల్లు పోవలసిన ఇబ్బంది తప్పింది. ఇక నేనున్నాను. మదరాసు నగరం వుంది. జన్మకల్లా శివరాత్రిలా ఎప్పుడోగానీ ఇలా నగరానికి రావడం కుదరదు. బంధువుల ఆదరణ సరిగ్గా లేదన్న కినుకతో అప్పటికప్పుడే తిరుగు ప్రయాణం పెట్టుకోవాలని ఎక్కడుంది? ఉండి రేపే వెళతాను. పేవ్‌మెంట్లు లేవా? పార్కు బెంచీలు దొరకవా? సినిమా థియేటర్లు కనిపించవా? ఒకవేళ అర్థరాత్రి తరువాత సినిమాలుకూడా కట్టేశారుపో, రైల్వే స్టేషన్లయినా మేలుకుని వుండవా?

నా సంచీ, నా ఆలోచనలు మాత్రం నన్ను వెన్నంటి వున్నాయి. పొడి ఎండతోకూడిన తడివాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా వుంది. నాలుగైదు రోజుల తరువాత ఎండను కళ్లచూచిన మదరాసుపౌరులు. ద్విగుణీకృతోత్సాహంతో రోడ్లను, వాహనాలను, అంగళ్లను సద్వినియోగం చేసుకుంటున్నారు. గమ్యమంటూ లేని బాటసారిగా ఎంతదూరం నడిచానో తెలియదు. పొద్దుపోయింది. చీకటిపడడానికింక కొంతసేపే వ్యవధి. కాళ్ళు నెప్పి పెడుతున్నాయి. ఎక్కడైనా కూర్చోవాలని ఉంది. నాలుగురోడ్ల కూడలిలో పేవ్‌మెంటుపైన పరిచిన పాతపుస్తకాలవైపు చూస్తూ ఒక హోటలు దాపున నిల్చుండిపోయాను.

సరిగ్గా అప్పుడే ఎదురుచూడని సంఘటన ఒకటి జరిగింది.

"ఇదిగో! మిస్టర్, నిన్నే!"

నన్నా! నిజంగా నన్నేనా? అందులోను అలాంటి పెద్ద మనిషి! సన్నగా మెలికలు తిరిగి గిరజాలుగా వంగిన తలకట్టుతో, ఆజానుపర్యంతం వేలాడుతున్న పొడుగాటి కోటుతో ఫ్రెంచి గవర్నరు డూప్లే లాంటివాడు, పెదవులకంటకపోయిన నల్లటి పైపునించి పొగపీల్చి, వదులుతున్నవాడు, పుష్పకవిమానంలాంటి తెల్లటి కారు కానుకొని గంభీరంగా నిల్చున్నవాడు! అంతటివాడు నన్ను పిలుస్తున్నాడని ఎలానమ్మగలను? కళ్ళకు కనిపిస్తుంటే, చెవులకు వినిపిస్తుంటే నమ్మకుండా ఎలా వుండగలను?

మానవులందరు సమానులే నంటారు! ఒక్క గాలిని పీల్చుకోవడంలో తప్పితే మరెందులో సమానులో నా కర్థంగాదు. నన్ను పిలుస్తున్న వ్యక్తిగూడా మనిషే! కానీ

చెవులదాకా గుబురుగా దిగివచ్చిన క్రాపింగులో, దట్టంగా కమ్ముకున్న కనుబొమ్మల్లో, పండిన టొమాటోలాంటి దేహచ్ఛాయలో అతడు మృగరాజంలా ఉన్నాడు. బహుశా నేనొక జింకపిల్లలా అతణ్ణి సమీపించి ఉంటాను.

దగ్గిరికి వెళ్ళగానే ఆయన ప్రశ్నించాడు.

"తెలుగువాడివే గదూ?"

అవునన్నట్టుగా తల పంకించానేమో! పెదవి కదిపి వుండను.

"ఏ జిల్లా?"

చెప్పుకున్నాను.

"మీది చింతపల్లి, అవునా?"

భూగర్భగృహానికి అడ్డుగా ఉన్న చెక్కల కూర్పులా నా పాదాలకింద పేవ్‌మెంటు కదిలిపోతున్నట్టుంది!

"మీ నాన్నగారి పేరు శేషాద్రి, నిజమే కదూ?"

చెక్కల కూర్పు విడిపోయింది, నేను దభేలున ఆశ్చర్యకూపంలో కూలిపోయాను.

కోలుకునేలోపల ఆయన నా భుజంపైన చెయ్యివేశాడు. "అబ్బాయ్! పెద్ద పెట్టున ఆశ్చర్యపడిపోకు. ఆశ్చర్యం కలగడానికి కారణమేమిటో చెప్పనా? తెలియకపోవడం! నిజం తెలిస్తే, లేదా కారణం తెలిస్తే ఆశ్చర్యం కలగనే కలుగదు. అప్పుడన్నీ సహేతుకంగానే కనిపిస్తాయి. నేను మీ ఊరి పేరు, మీ తండ్రి పేరు ఎలా చెప్పగలిగానని నీ కాశ్చర్యం! ఎలా చెప్పగలిగానో తెలిస్తే నువ్వు ఆశ్చర్యపడవు..."

"చెప్పండి, సార్! నాకూ తెలుసుకోవాలనే ఉంది" అన్నాను.

"భలే గడుసువాడివే! అంత సులభంగా చెప్పేస్తానేమిటి?" ఆయన చిలిపిగా నవ్వుతున్నాడు.

సులభంగా చెప్పక అందుకోసం ఆయన ఆశించే ప్రతిఫలం ఏమిటో నా కర్థమయింది కాదు !

"నిన్ను గురించి నే నెలా తెలుసుకోగలిగానన్న విషయాన్ని నువ్వు తెల్సుకోదలిస్తే అందుకొకటే మార్గం ఉంది. ముందుగా నువ్వు నా ప్రశ్నలకు సమాధానం చెప్పాలి."

'అలాగేనండి! చెబుతాను' అన్న సమాధానం నాలుక చివరిదాకా వచ్చింది. కానీ అంతలోనే నాయొక్క ఆ ఎదుటి వ్యక్తి యొక్క విజ్ఞతలను పోల్చుకోవడంతో నేను బెంబేలుపడిపోయాను. ఆయన అడగబోతున్న ప్రశ్నలెలాంటివో నాకు తెలియదు. వాటికి సదుత్తరా లిచ్చుకోగల విజ్ఞత నాకెక్కడిది? కొంపదీసి ఈయన మెస్మరిజం, హిప్నాటిజం లాంటి వేవైనా చేసి నా నోటి గుండా ఏవైనా రహస్యాలను వెళ్ళగక్కించడు గదా! పెద్ద చిక్కులోనే తగులుకున్నట్టయింది నాకు !

ఆయనగూడా నా కలవరాన్ని గుర్తించినట్టే కనిపించాడు. " అబ్బాయ్! నీ పేరేమిటో తెలియదు నాకు. తెలుసుకోవాలని కూడా లేదు. నీ పేరుతో పిలవడం కన్నా నిన్ను జూనియర్ శేషాద్రీ అని పిలవడమే నా కిష్టం. అలాగే పిలుస్తాను. మై డియర్ ఫ్రెండ్ ! జూనియర్ శేషాద్రీ! నాపైన అనుమానాలు పెట్టుకోకు. నా మూలంగా నీకెలాంటి

అపకారము జరగదు. పాతికేళ్ళనుంచి నీలాంటి వాడికోసం వేచి చూస్తున్నాను నేను. ఈనాటికి నువ్వు దొరికావు. కానీ సత్సంకల్పాలకు లోకంలో ఎన్నో విఘ్నాలుంటూనే వుంటాయి. ఇప్పుడు గంట ఆరున్నర కావస్తూంది. ఏడు గంటలకు నాకో ఎంగేజిమెంటు వుంది. ఎనిమిదికి పూర్తి అవుతుంది. అప్పుడు నువ్వు నన్ను కలుసుకోవాలి..."

తన ధోరణిలోనే తనకు నచ్చినదేదో స్ఫురించినట్టుగా చేతివేళ్ళతో కణతల్ని పరామర్శించుకుంటూ కొనసాగించా డాయన. "అదిగో, ప్రపంచంలో ఎవడి గొడవలు వాడివి. ఎవడికి వాడే స్వార్థపరుడు. కాకపోతే నావీలేదో నేను చూచుకుంటున్నానంతేగానీ, నువ్వెందు కోసం ఇక్కడికి వచ్చావో, ఎక్కడికి వెళుతున్నావో, నన్ను కలుసుకునే వీలు నీకుంటుందో ఉండదో ఆలోచించానా?"

"అబ్బే, ఫరవాలేదండి! నాకేం పనుల్లేవు..." అన్నాను. అన్నానేగానీ ఆయనను నా అంతట నేనెందుకు కలుసుకోవాలో నాకు బోధపడడంలేదు. ఇంతకు ఆయన నన్ను ఆజ్ఞాపిస్తున్నాడా? ప్రాధేయపడుతున్నాడా?

"అయితే నువ్వొక పని చెయ్యాలి. ఎనిమిదివరకు నువ్వెక్కడైనా తిరుగు. ఎనిమిది కాగానే ఒక టాక్సీని పిలువు. ఇదిగో, ఈ చీటీ చూపిస్తే పదిహేను నిమిషాల్లో నువ్వు మా ఇంటిముందర ఉంటావు. ఆశాభంగం కలిగించవు కదూ! తప్పకుండా రావాలి. నేను నీకోసం వేచి ఉంటాను."

కాదు కూడదని ఆయన కోరికను నిరాకరించే పాటి తెగువ నాకు లేకపోయింది!

అంతలో ఏవో పుస్తకాలూ, ప్యాకెట్లూ పుచ్చుకుని డ్రయివరు కారు సమీపించాడు.

ఆయన కారులో కూర్చున్నాడు. కదిలిపోతున్న కారులోనించే మాటలు వెనక్కి దూసుకువచ్చాయి– "మై డియర్ యంగ్ ఫెలో! మరిచిపోవద్దు వేచి వుంటాను."

మదరాసు వీధులు. ఆ వీధుల్లో జరిగే అంతర్నాటకాలు బాగా రంజుగానే ఉన్నట్టు తోచింది. ఎవరైనా పల్లెటూరివారు కనిపిస్తే, ఇక్కడివాళ్ళు వాళ్ళని కికురించడంలో బాగా తరిబీతు పొందినట్టున్నారు. నా ఆలోచన పరిపరి విధాలుగా ననలు సాచుకుంటూంది. ఆ క్షణాల్లో నాకు కుట్రలతో, ఖూనీలతో, ఎలిబీలతో అల్లిన డిటెక్టివ్ కథలెన్నో జ్ఞప్తికి వచ్చాయి. లేకపోతే ఈయన పాతికేళ్లుగా నాలాంటివాడికోసం వేచి చూస్తున్నాడా? అరేబియన్ నైట్స్ కథల్లోని మాంత్రికుడికి అల్లా ఉద్దీను దొరికినట్టుగా ఈనాటికి నేనీయనకి దొరికానా?

బాగానే ఉంది. కథకు కాళ్ళు వచ్చేశాయి. ఇక నడిపించినా నడిపించవచ్చు. విరగగొట్టినా విరగగొట్టవచ్చు. వెళ్ళడమా, మానడమా?

కుతూహలం చెడ్డది. (మంచిది కాదా!) అది మానవుడిచేత ఎలాంటి పని అయినా చేయిస్తుంది. (సాహసకార్యాలు కూడా!) వెళ్ళకపోతే ఇదొక చిదంబర రహస్యంలా నన్ను జీవితాంతము వెంటాడకమానదు ఈ ఉదంతాన్ని విన్న వాళ్ళందరూ "అయ్యో, వెళ్ళలేక పోయావా! అయినా ఇంతటి పిరికితనమా!" అంటూ ఎద్దేవా చెయ్యకపోరు.

వెళ్ళాలన్న నిర్ణయానికి వచ్చి తరువాత వున్నట్టుండి కాలచక్రం ఆగిపోయినట్టు తోచింది. ఒకవేళ కదలుతున్న బండరోకలి, బండరోకలికన్నా వేగంగా పాకడం లేదనిపించింది. ఆ గంట గంటన్నర వ్యవధిలో ఆయన నా చేతికి ఇచ్చిపోయిన చీటీని

నాలుగైదుసార్లు చూసుకున్నాను. అందులో ముచ్చటగా మూడే మాటలున్నాయి. "ఏ.జె, దేవంబంధు, విస్‌డమ్ విల్లా, మైలాపూరు..." అక్షరక్షరాన్ని పరిశీలించి చూచాను. అందులోనుంచి క్లూలవంటివేవీ దొరికే సూచనలు లేవు.

గుడి ఆవరణకి ఈవలగానే ఆగిపోయే పాదరక్షలకు మల్లే టాక్సీ రోడ్డు పైనే ఆగిపోయింది. గేటు కొక వైపు గోడకు తాపడం చేసివున్న చలవరాతి పలకపైన చీటీముక్కలో ఉన్న మాటలే కనిపించాయి. ఆ చీటీకేసి ఒకసారి, నా ముఖంకేసి రెండుమూడుసార్లు చూచిన గూర్ఖావాడు ఎంతో కొంత అయిష్టంగానే నేను లోపలికి వెళ్ళడానికి సమ్మతించాడు.

గేటు దాటుకోగానే పొడుగాటి సన్నటి చెట్లతో, ఏవో పూలమొక్కలతో, పొదరిళ్ళతో చిట్టడివిలాంటి తోట కనిపించింది. ఆ తోట నడుమ వంకరులు తిరుగుతూ వెళుతున్న బాట ఒకటి. వెలుతురుకన్నా చీకటే ఎక్కువగా, అలజడికన్నా ప్రశాంతతే ఎక్కువగా నెలకొని ఉన్న ప్రదేశం అది. చెట్ల సందుల్లోనించీ తెల్లటి, గోడలు, దీపాల కాంతి కనిపించకపోతే, పొదల మాటునించీ రేడియో సంగీతము నవ్వుల సవ్వడి వినిపించకపోతే అక్కడ జనసంచార మున్నదన్న నమ్మకమే కలిగేది కాదు.

హఠాత్తుగా రోడ్డు ఆఖరైపోయింది. నేను భవనం ఎదుట నిలబడి ఉన్నాను;

పై కప్పును మొయ్యడం కోసమనిగాక, అందంగా ఉండాలన్న ఉద్దేశంతో రెండింటిని మూడింటినీ ఒకటిగా అనించి కట్టిన స్తంభాలకు కింద, విశాలమైన వరండా దగ్గిరనించి ప్రారంభమై, దూకుతున్న కడలి అలల్లా క్రిందకి దిగివస్తున్న సోపానపంక్తికి ఎట్టయెదుట, ఓ జలయంత్రానికి అల్లంత దూరంలో నేను నిలబడి వున్నాను.

ఆ జలయంత్రానికి, భవనానికి మధ్యనున్న పచ్చిక తిన్నెలపైన ఆడామగా, చిన్నా పెద్దా కలిసి ఓ ఏడెనిమిది మంది పేముకుర్చీల్లో కూర్చుని కులాసాగా కాలక్షేపం చేస్తున్నారు.

వారిలో మొట్టమొదట నావైపు చూచిన వ్యక్తి నడివయస్కురాలైన పాశ్చాత్య వనిత. మిగిలిన వారిలో పాతికేళ్ల యువకు డొకడు, పదహారేళ్ళ పడుచువాడొకడు, పెళ్ళి కెదిగిన అమ్మాయి లిద్దరు. మిగిలిన వారు పది పన్నెండేళ్ళకు లోబడిన చిన్న పిల్లలు. వారిలో దేశవాళీ వాలకంకన్నా విదేశీ లక్షణాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. హారంలో నాయకమణిలా మధ్యగా కూర్చున్న ఆ పాశ్చాత్య వనిత నేను కనిపించగానే "జాకబ్, జాకబ్!" అంటూ గొంతెత్తి పిలిచింది. నల్లటి కుర్రవాడొకడు సోపానపంక్తి పైన కనిపించి అంతలోనే అంతర్హితుడయ్యాడు. అతడు లోపలికివెళ్ళిన కొద్ది నిమిషాలకే మేడపై భాగాన ఉన్న పెద్ద విద్యుద్దీపం ఒకటి వెలిగింది. చప్పుడు లేకుండా మేడపైన కిటికీ ఒకటి తెరుచుకుంది. చువ్వలోనుంచీ పరిచితమైన ముఖం కనిపించింది. "వచ్చావా, అబ్బాయ్! పైకి రా" అంటున్నాడాయన.

జాకబ్ దారి చూపిస్తూండగా కొయ్యమెట్లెక్కి పైకి వెళ్ళాను. గది తలుపులే కాకుండా ఆయన చేతులు గూడా నాకోసం తెరుచుకుని వున్నాయి. ఆయన సాదరంగా నన్ను ఆహ్వానించాడు. అలాగే తీసుకువెళ్ళి ఓ కుర్చీలో కూర్చోపెట్టాడు. ఆపిల్ పళ్ళముక్కలు, బిస్కట్లు ఉన్న ప్లేటు నా ముందరికి జరిపాడు. ఆ గృహస్థుడి ఆదరణలో ఉక్కిరి బిక్కిరై

పోతున్న నాకు ఆ గది ఒకసారి కలయపరికించడానికైనా వీలు లేక పోయింది. కుర్చీలో కూర్చున్న తరువాత గోడ కొక వారగా ఉన్న పుస్తకాల బీరువాలు కనిపించాయి. పెద్ద సైజు పెయింటింగ్ చిత్రాలు కొన్ని గోడలకు వేలాడుతున్నాయి. గది నడుమ ఉన్న టేబిలుపైన ఏసుక్రీస్తును సిలువ వేసిన విగ్రహం వుంది. మెల్లగా కాలుతున్న అగరువత్తులు కమ్మటి పరిమళాన్ని గది అంతటా నింపుతున్నాయి. తన విచిత్ర ప్రవర్తనతో నా పాలిటికి కౌంట్ ఆఫ్ మౌంట్ క్రిస్టోలా కనిపిస్తున్న ఏ.జె.దేవబంధు బల్ల కటువైపున వాలుకుర్చీలో కూర్చున్నాడు. ఆ వినూత్న వాతావరణం నన్ను స్తబ్ధుణ్ణి చేయడంలో ఆశ్చర్యంలేదు. కానీ ఏదో మాట్లాడాలని నన్నక్కడికి రమ్మన్న పెద్దమనిషి కూడా చేతులను వాలుకుర్చీ పైనించీ వెనక్కి వేలాడవేసుకుని, అరమోద్పు కన్నులతో పైకప్పుకేసి చూస్తూ నాలుగైదు నిమిషాలపాటు మౌనంగానే వుండిపోయాడు.

ఆ వ్యవధిలో నేను ప్లేటు ఖాళీ చేశాను. ఆయన పైకి లేచి సీసాలోని పళ్ళ రసాన్ని గ్లాసులోకి వంచాడు. తిరిగి కుర్చీలో కూర్చుంటూ ఉపక్రమించాడు.

"రావేమోననుకున్నాను. ఎలాగైతేనేం, వచ్చేశావు నాకు చాలా ఆనందంగా ఉందోయీ, జూనియర్ శేషాద్రీ!"

"నన్ను రాజశేఖరం అంటారు" అన్నాను.

"అయితే అలాగే పిలుస్తాను. చూడు, మిస్టర్ శేఖరం! నా ప్రశ్నలకు సూటిగా సమాధానాలు కావాలి. ఈ వివరాలన్నీ నాకెందుకు కావలిసివచ్చాయన్న కుతూహలాన్ని గూడా నువ్వు చివరిదాకా ఆపుకోవాలి."

"అలాగేనండి! అడగండి' అన్నాను.

"మొదటి ప్రశ్న. ముఖ్యమైనదికూడా! మీ చింతపల్లి ఎలా ఉంది?"

ఎదుటివ్యక్తిని ఆశ్చర్యాంబుధిలో మునకలు వేయించడమే ఆయన ఉద్దేశ్యమైన పక్షంలో, నేనాయన చేతిలో ఒక ఆటవస్తువుగా పరిణమించ దలచుకోలేదు. తేడాలుంటే ఉండవచ్చును గాక. ఎవడికి తగ్గ వ్యక్తిత్వం వాడికుంటుంది. ఈ భావనవల్లనే కావచ్చు నా జవాబులో గూడా కాస్త తిరగబడిన తత్త్వం ప్రకటితమైంది.

"చింతపల్లి కేమండీ! బాగానే వుంది. కాదంటే ఏ చెట్లవల్లనైతే ఆ ఊరికి చింతపల్లి అని పేరు వచ్చిందో ఆ చింతచెట్లను మాత్రం సమూలంగా కుళ్ళగించి పారేశారు. కొందరు వాటిని బొగ్గులుగా మార్చి అమ్ముకోగా, మరికొందరు వాటితో ఇటుకశూలలు కాల్పించుకున్నారు. పాకలున్న చోట మేడలు లేచాయి. ముందరవచ్చిన చెవులకన్నా, తరువాతి కొమ్ములే వాడి! కొత్త కట్టడాల్లో కరెంటు దీపాలు వెలుగుతున్నాయి. పాతమేడలు కొన్నింటిలో చమురుఖర్చుకైనా వెరవులేని లేమిడి సంసారాలు జరుగుతున్నాయి. నిన్న మొన్నటివరకు ఊరికంతటికీ పెద్దదళవాయి రామన్న. ఈ మధ్య జరిగిన పంచాయతీ బోర్డు ఎన్నికల్లో అతడికి స్వంతవార్డులో అక్షరాలా తొమ్మిదే ఓట్లు పడ్డాయి. ఒక మనిషి ఇంకొక మనిషి ఎదుట మొదటివాడు ఎంత కొమ్ములు తిరిగినవాడైనాసరే. ఒదుగుళ్లు పోయే కాలం వెనకపట్టింది. 'నీ అంతటివాడివి నువ్వయితే, నా అంతటివాడిని' నేనన్న ఆత్మ ప్రత్యయం బలిసింది. విలువల్లో తేడాలు రావడంతో రోజులు మారి

పోతున్నాయనుకోడం రివాజు అయింది. ఈ మార్పు కొందరికి ఇష్టంగానూ ఉంది. మరికొందరికి అయిష్టంగానూ వుంది. ఒకరి ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా కాలం గడచిపోతూంది. చదువుకుంటున్న పిల్లలున్న తండ్రిని కదిపి చూడండి, ఎలిమెంటరీ స్కూళ్ళనుండి విశ్వవిద్యాలయాలవరకు వున్న అవకాశాలను గురించి లేని సదుపాయాలను గురించి వినగలము. వ్యవసాయ విద్యలో పట్టాపుచ్చుకున్న విజ్ఞానవంతుణ్ణి చిక్కు ప్రశ్నలతో తికమకపెట్టడాని కొక మామూలు రైతే చాలు. ఇదంతా ఎలా వుందంటే గ్రామీణ జీవితమన్న పెద్ద బాణలిలో ఏవేవో ఘన, ద్రవపదార్థాలు కళపెళలాడిపోతున్నాయి. పొంగులు వస్తున్నాయి. బుడగలు లేస్తున్నాయి. మంట చల్లారాలి. మిశ్రమం గట్టిపడాలి. అప్పుడుగానీ ఈ బాణలిలో తయారయ్యే పదార్థం ఎలాంటిదో మనకు తెలియదు."

దేవబంధుగారి ముఖంలో ఉత్సుకత కనిపించింది. ఉద్వేగం కనిపించింది.

"బాగా చెప్పావోయ్, రాజశేఖరం! నీ మాటలు వింటుంటే కాలాన్ని చొచ్చుకొని నలభైఏళ్ళు వెనక్కి వెళ్ళినట్టయింది. ముమ్మూర్తులా శేషాద్రి ఇలాగే ఉండేవాడు. సరిగ్గా ఇలాగే మాట్లాడేవాడు. ఇద్దరము కలిసి చెరువులో ఈదుకుంటూ వెళ్ళి తామరపువ్వులు తెచ్చుకునేవాళ్ళం. చిటారుకొమ్మదాకా పాకి కాయలు కోసుకునేవాళ్ళం. ఏ తిరణాలకు వెళ్ళినా కలిసేవెళ్లేవాళ్ళం. ఇంట్లో పండుగలు పబ్బాలు చేసుకుంటే నన్ను వదిలిపెట్టి భోజనానికి కూర్చునేవాడుగాడు శేషాద్రి. నేను పది దేశాలు తిరిగాను. పదిపదుల వందమందిమిత్రులనైనా సంపాదించాను. కానీ మనసు లోపలి అట్టడుగు పొరల్లో స్థిరంగా, చెరిగిపోని ముద్ర వేసుకుని కూర్చున్నవాడు శేషాద్రి ఒక్కడే! చెప్పు, శేఖరం! శేషాద్రి కులాసాగా వున్నాడు కదూ?"

"లేరండీ! నాన్నగారు పోయారు..." అన్నాను.

నాకు కనిపించనివ్వకుండా ఆయన ముఖాన్ని గోడవైపుకు తిప్పుకున్నాడు.

"ఇంటికి నేను పెద్దవాణ్ణి. నాపైన ఎన్నో ఆశలుండేవి ఆయనకు! హైస్కూల్లో చదువుకుంటూ వుండగానే ఆయన చనిపోయారు. నేను కాలేజి మెట్లెక్కలేకపోయాను..."

ఒకటి రెండు నిమిషాలు మౌనంగా గడిచిపోయాయి.

"రాజశేఖరం!" అంటూ ఆయన నావైపు తిరిగాడు. ఆ కళ్ళల్లోని చెమ్మ నేను పసిగట్టలేకపోలేదు. "హరిరావుగారంటూ ఒకాయన ఉండేవారు. ప్రభుత్వం జీతం ఇవ్వకపోయినా  పిల్లలకు బడి చెప్పేవాడాయన. ఆ బడి బడికాదు. రావిచెట్టు నీడ. ఆ చదువు చదువుగాదు. ఆయన చెబుతూండగా శిష్యులు వినడం మాత్రమే! ఇదిగో, ఇక్కడున్న పుస్తకాల్లో కొన్నింటిని నేను టేప్‌రికార్డరులా ఒప్పజెప్పగలను. కానీ హరిరావుగారి చదువులా నా కేది ఒంటబట్టలేదు. కోపం వస్తే ఆయన అగ్గిరాముడు! ఒళ్ళంతా వాతలు తేలిపోయిన రోజున పంతులుగారి ఇంట్లోనే భోజనం. కొట్టినా ఆయన కొట్టవలసిందే! పెట్టినా ఆయన పెట్టవలిసిందే!"

"అవునట! నాన్నగారు చెప్పగా చాలాసార్లు విన్నాను. నాకు బుద్ధి తెలిసేసరికి ఆయన గతించాడు."

"ఆయన కిద్దరు కొడుకులుండాలి..."

"పెద్దవాడు దామోదరం. వైద్యం పిచ్చిలో ఏవో మూలికలకోసం శ్రీశైలం కొండల్లోకి వెళ్ళినవాడు తిరిగిరాలేదు. చిన్నవాడు శ్రీహరి ఎక్కడో ద్రోణాచలం పరిసరాల్లోని రోడ్ల కూడలిలో చిన్న నాష్టా అంగడి నడుపుతున్నాడని వినికిడి."

దేవబంధుగారు వేడిగా నిట్టూర్చారు.

"ఊరి చివరగుడిసెలో వుండేవాడు మడివేలు మునెన్న. నారపీనుగ. ప్రాయంలో నేపాల్ వెళ్ళి అక్కడి గనుల్లో, తోటల్లో పనిచేసివచ్చాడు. వాడి జ్ఞాపకాల భోషాణంలో లెక్కలేనన్ని గాథలుండేవి. ఆకులల్లాడని వేసవికాలపు సాయంకాలాల్లో పిల్లలనందరిని చుట్టూరా కూర్చోబెట్టుకుని తన అనుభవాలను ఏకరువు పెట్టేవాడు."

"పాపం, ఆ ముసలివాడికికూడా చివరిరోజుల్లో ఇడుములే ఎదురయ్యాయి. కొడుకులూ, కూతుళ్లూ వాళ్ళ వయస్సు వాళ్ళకు రాగానే రెక్కలు వచ్చిన పక్షుల్లా లేచిపోయారు. పెళ్ళాం అంతకుముందెప్పుడో కళ్ళు మూసింది. తానొకడే ఊరిబట్టలు పిండుకుంటూ, పొట్టపోసుకునేవాడు. బాగా ముసలితనం పైబడిందేమో, శరీరంలో ఓపిక తగ్గింది. లేని ఓపికను తెచ్చుకోడంకోసం జీర్ణకోశాన్ని సారాతో దట్టించసాగాడు. జీర్ణశక్తి తగ్గింది. దగ్గు ప్రారంభమైంది. ఆ దగ్గు ఎంతగా విజృంభించిందంటే దాని తాకిడికి ఊళ్ళో కొందరికి నిద్రే కరువైపోయింది. అందరు కలిసి పదిరూపాయలు పోగుచేసి ఇచ్చి వింటిబద్దలా వంగిపోయిన ఆ ముసలివాణ్ణి పల్లెనించి సాగనంపేశారు."

దేవబంధుగారు ఎడమచేతితో ఫాలతలాన్ని అదిమి పట్టుకుంటూ పైకి లేచారు. వెళ్ళి కిటికీవైపు తిరిగి నిల్చున్నారు.

"రాజశేఖరం! ఇక ఎంతోసేపు నిన్ను విసిగించను. కానీ ఈ ఒక్క విషయం మాత్రం నాకు కావాలి. చింతపల్లి నడివీధిలో రెండు మిద్దెలుండేవి. ఒకటి పాపయ్యగారిది, రెండోది వీరాసామిది. ఆ రెండుమిద్దెలు ఒకటే కాపురంగా కలిసిపోవడం నాలుగు దశాబ్దాలనాటి మాట. ఆ తరువాతి వివరాలే నాకు కావలిసినవి."

దేవబంధుగారు ఏ ఇద్దరువ్యక్తులను గురించైతే ప్రస్తావిస్తున్నారో ఆ ఇద్దరిలో ఒక్క పాపయ్యగారిని మాత్రం నేనెరుగుదును. ఆయనగూడా చాలా కాలం కిందట చనిపోయాడు. ఆ పాపయ్యగారికి ఒకే కూతురు తులసమ్మ. పక్కింటి వీరాసామికి ఒక్కడే కొడుకు రంగనాయకులు. ఆ తులసమ్మను రంగనాయకులికిచ్చి వివాహం చేయడంతో ఆ రెండు సంసారాలు ఒకటయ్యాయన్నది గూడా నాకు వినికిడిద్వారా తెలిసిన వృత్తాంతమే! ఎందుకంటే ఆ తులసమ్మకు, రంగనాయకులకు వయసులో నాకంటే పెద్దవాడైన కుమారుడున్నాడు!

"తులసమ్మ బాగుందా, రాజశేఖరం?"

ఆ ప్రశ్నించిన ధోరణినిబట్టి చూస్తే, ఎన్ని వంకరలు తిరిగినా రైలు చివరికి స్టేషనులోనే వచ్చి ఆగినట్టుంది.అయినా ఊరిలో ఎన్నో కాపురాలుండగా ఆ రెండిటిని గురించి, అందునా తులసమ్మ గురించి ఈయన ప్రత్యేకంగా అడగడానికి కారణం?

ఇంతకూ ఈ దేవబంధుగా రావ్వెరు? ఈయనకు చింతపల్లి గత చరిత్రతో గల సంబంధమేమై వుంటుంది? ఆశ్చర్యంతో తల దిమ్మెక్కిపోతూందే గానీ, ఊహ ముందుకు సాగడంలేదు.

ఆగినట్టాగిన రైలు అంతలోనే కదిలింది.

"ఆ తులసమ్మ కొక మేనత్త కొడుకుండేవాడు. వాడి పేరు అంజి. తులసమ్మ పుట్టగానే అంజికి పెళ్ళాం పుట్టిందని చెప్పుకున్నారు లోకులు. అనుకున్నవన్నీ అనుకున్నట్టే జరగవు. ఆ అంజిగాడిది ఒక వక్ర జాతకం. వాడు చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయాడు! మేనమామ పాపయ్యగారే వాడి పెంపకం బరువు మొయ్యవలసి వచ్చింది. ఆ కుర్రవాడు తన కర్మ ఇలా కాలిందన్న ధ్యాసే లేక లేనిపోని గొంతెమ్మ కోరికల్ని పెంచుకున్నాడు. పాపయ్యగారు తనను తీసుకువెళ్ళి రంగన్నపేట హైస్కూల్లో చేర్పించేసరికి, బాగా చదివించి ఆయన తన కూతురునిచ్చి పెళ్ళిచేస్తారని కొండంత ఆశ పెట్టుకున్నాడు. అతగాడి హైస్కూలు చదువు తీరా మారా పూర్తికాకమునుపే, అప్పటి కింకా పెళ్ళి ఈడైనా రాని తులసమ్మకు వివాహం నిశ్చయమైంది. వీరాసామి కొడుకు రంగ నాయకులే వరుడు! వీరాసామి డబ్బులో, దాబులో, దర్పంలో అన్నివిధాలా తనకు సాటివాడు. తనకొక్కత్తే కుమార్తెగా పుట్టడం వల్లనే తులసమ్మ అదృష్టవంతురాలు. ఆ అదృష్టాన్ని రెండుతో గుణించాలను కున్నా రంతేగానీ, పాపయ్య గారందువల్ల ఓ లేతగుండెకు తగిలే దెబ్బ ఏపాటిదో గ్రహించలేకపోయారు. స్వార్థం అలాంటిదే! అది తన ఇంటిముందర పందిరి వేసుకోడానికి కల్పతరువును ఖండించడానికైనా వెనుదియ్యదు. పాపయ్యగారి దృష్టిలో అంజి ఏపాటివాడు? వాడు దిక్కూ మొక్కూ లేని దురదృష్టవంతుడు. ఆయన తన మోచేతి గంజి తాగేవాడికి దురభిమానా లుండగూడదన్నాడు. కానీ ఆ గంజి తాగడంకన్నా, ఆ నికృష్టపు బ్రతుకు బ్రతకడం కన్నా అంజికి నాలుగిళ్ళు అడుక్కుతిన్నా నయమేననిపించింది. వాడు దేశాలపాలైపోయాడు! చింతపల్లిలో ఎవరైనా ఆ నిర్భాగ్యుణ్ణి గురించి తలపెడుతుండగా విన్నావా, రాజశేఖరం?"

"వినకేమండీ! రంగన్నపేట హైస్కూల్లో చదువుకుంటున్న రోజుల్లో అతడు, మా నాన్నగారు కలిసి తీయించుకున్న ఫొటో ఒకటి ఇంకా మా ఇంట్లో వుంది. మా నాన్నగారు అతణ్ణి గురించి తలచుకోని రోజు వుండేది గాదు. పల్లెటూరి పెద్దల ప్రసంగాల్లో గూడా అతడి పేరు తరచుగా దొర్లుతూండేది. వెళ్ళిపోయిన తరవాత అతడి ఆచూకీ మాత్రం తెలిసింది గాదు. బైరాగుల్లో కలిసిపోయాడని కొందరనుకునేవారు. లేదు లేదు, అక్కడెక్కడో రైల్వేస్టేషన్లో ఇడ్లెన్లు అమ్ముకుంటున్నాడని కొందరు చెప్పుకునేవారు."

"కానీ ఒక వ్యక్తి లోకుల ఊహల కనుగుణంగా బైరాగుల్లోనే కలిసిపోవాలనిగానీ, ఇడ్లెన్లే అమ్ముకోవాలనిగానీ విధి నిర్దేశించదు. వాస్తవం వాళ్ళ ఊహలకు విరుద్ధంగా పరిణమించకూడదని సృష్టికర్త శాసనం వ్రాసిపెట్టలేదు. ఎలాగంటావా, రాజశేఖరం?" ఆయన గిరుక్కున వెనుదిరిగి నన్ను సమీపించాడు. సత్యం వీలైనంత స్థూలస్వరూపం ధరించినట్టుగా ఆ నిలువెత్తు మనిషి నిటారుగా నా ఎదుట నిల్చున్నాడు –" ఆ అంజినే నేను!"

"మీరా?"

"అవును. పాపయ్యగారి మేనల్లుణ్ణి, మీ నాన్నగారు శేషాద్రికి మిత్రుణ్ణి, తులసమ్మకు కాలేకపోయిన మొగుణ్ణి, అంజిని నేనే! చేత పైసలేక ఈ మదరాసు నగరానికి ఎలా

వచ్చానో, ఈ నగర వీధుల్లో ఎన్ని అవస్థలు పడ్డానో అవన్నీ నేనిప్పుడు చెప్పను. ఒక చెట్టు పైకి జేరుకోవాలన్నది నా సంకల్పం. తాటిని పట్టుకుని పై కెగబాకుతున్నాను. సగంలో వుండగా నా కింది భాగాన తాటిని కత్తిరించి పారేశారు! ఇక నేల నాది కాదు జారి కిందపడితే ఎముకలు విరిగి, ఒళ్లు నుగ్గు నూచమైపోవడం ఖాయం! ఎలాగైనా కింది కొమ్మదాకా పాకడ మొకటే గత్యంతరం!

"ఆ పరిస్థితుల్లో నా మనస్సు మతం మార్పిడీ పైకి మళ్లింది. ఈ మతం మార్పు చాలా చిత్రమైంది. ఇందువల్ల శరీరం మారడం లేదు. మనస్సు మారదు. ఒకరకమైన మానవ సమాజంలో సన్నిహిత సంబంధాలు తెంచుకుని, ఇంకొక రకమైన సమాజంతో కలిసిమెలిసి వుండవలిసి వస్తుంది. శారీరక లక్షణాల్లోనూ, మనోవికారాల్లోనూ వారికి, వీరికి అట్టే తేడా కనిపించదు. ఎటొచ్చీ బాహ్యాచారాల్లో మాత్రమే భిన్నమైన పోకడలు, కొత్త ఆచారాలు అలవరుచుకోడంవల్ల నాకు నష్టమయ్యేదేముంది? అందుకు నేను సిద్ధపడ్డాను. కొత్త సమాజం నేను చదువుకునే వెరవు కల్పించింది. పట్టుగా చదివి అయిదారేళ్ళలో పట్టా పుచ్చుకున్నాను. అప్పటికీ నాకు తృప్తి కలగలేదు. చిన్నతనంలో హరిరావుగారు మాకో పద్యం చెప్పారు. సుజనుడు కందుకంలాంటివాడు. కిందికివేసి కొట్టినా బంతిపై కెగురుతుంది. మందుడు మట్టిముద్దలాంటివాడు. ఒకసారి కిందికి కొడితే ఇక నేలకంటుకపోవడమే! నేను కందుకాన్నా మృత్పిండాన్నా? ఈ పరీక్షలో పరిపూర్ణ విజయాన్ని సాధించేదాకా నాకు సంతృప్తి కలిగేటట్టు లేదు. ఒక ధార్మికుల సంస్థ విద్యార్థులకోసం ఏర్పాటుచేసిన స్కాలర్‌షిప్పు సంపాదించాను. సీమకు వెళ్ళాను. అక్కడ చదువుకుంటూ, చదువు ముగిసిన తరవాత ఉద్యోగం చేస్తూ గడిపిన ఏడెనిమిదేళ్ళలోనే నాకు వివాహమైంది. భార్య మార్గరేట్ అనుకూలవతి. బిడ్డలు కలిగారు. వాళ్ళూ బుద్ధిమంతులు. అప్పటికింకా దేశంలో బ్రిటిష్‌వారి హయాం కొనసాగుతూంది. తిరిగి వచ్చేసరికి ఒక ఉన్నతోద్యోగం కాచుకుని వుంది. ఆ ఉద్యోగం చేస్తూ నిండుగా రెండు దశాబ్దాలపాటు ఉత్తరదేశంలో ఉండిపోయాను. ఉద్యోగ విరమణ చేయవలసిన వయస్సు వచ్చింది. చివరిరోజులు ప్రశాంతంగా గడపడానికి నా అభివృద్ధి వెలుగుబాటలు చూపిన ఈ నగరాన్నే ఎన్నుకున్నాను. ఇదే నా ఇల్లు! ఇంతకు మునుపు చూశావుగా, అదే నా కుటుంబం! చెప్పి ముగిస్తున్నానే, ఇదే నా జీవితకథ!"

అపూర్వమైన విచిత్రానుభవం ఒకటి ఆవహించినట్టుగా నా మనసు చైతన్యాన్ని కోల్పోయింది. నేను కూర్చున్న గది అప్పుడు నా పాలిటి కొక అంతరిక్ష నౌకలా భాసిస్తూంది. ఆ నౌక నన్ను గతంలోకి తీసుకువెళ్ళింది. కొద్ది నిమిషాల్లో అనేక సంవత్సరాల గత వృత్తాంతాలను వెండితెరలా నా మనోనేత్రం ఎదుట సాక్షాత్కరింపజేసింది!

"బాయ్, బాయ్" అంటూ జాకబ్‌ని పిలిచారు దేవబంధుగారు. గుక్కపట్టి రెండుగ్లాసుల మంచినీళ్ళు తాగేశారు. ముఖంపైన కమ్ముకున్న స్వేదబిందువులను తుడుచుకుంటూ మళ్ళీ వాలుకుర్చీలో కూర్చున్నారు.

"కానీ నువ్వు నన్ను అపార్థం చేసుకోగూడదు రాజశేఖరం! నిన్నిక్కడికి పిలిపించింది నా జీవితగాథను వల్లించి, ఆశ్చర్య చకితుణ్ణి చెయ్యడానికి కాదు."

ప్రశ్నార్థకంగా ఆయనవైపు చూస్తున్నాను.

"బడబాగ్నిలా నా హృదయంలో దాగిఉన్న ఆవేదన వెళ్ళబోసుకోవాలని..."

"మీ కావేదనా? ఎందుకూ?" తెల్లబోతూ అడిగాను.

"చెబుతున్నాను. రాత్రుళ్ళలో నిద్రపడుతుంది. తెల్లవారుజామున మేల్కొంటాను. ఆ మేల్కొన్న మొదటి క్షణంలో నాకు నేను దేవబంధునని అనిపించదు. చదువుల్ని సాధించాననీ, విదేశాలకు వెళ్ళివచ్చాననీ, మార్గరేట్‌కి మొగుణ్ణనీ జ్ఞప్తికి రాదు. చింతపల్లిలో ఆరు బయట వేసుకున్న నులకమంచం మీద లేచి కూర్చున్నట్టే తోస్తుంది. ఆ చింతపల్లివారి ఊహల్లో నేను బైరాగిని. ఇడ్డెన్లు అమ్ముకునేవాణ్ణి. ఇంకా మాట్లాడితే బస్‌స్టాండులో కూలీని, కాని ఈ శరీరంలోని జీవాత్మ నేను ఆదమరచినప్పుడల్లా ఆ చింతపల్లి పరిసరాల్లో సంచరించడానికి వెళ్ళిపోతుంది. విరూపాక్షమ్మగుడి ఎదుట రాతిస్తంభాల మధ్యన ఉన్న ఉయ్యాల, దళవాయి నరసన్నగారి తోటలో జామపళ్లు, వీరారెడ్డిగారి పొలాల్లో చెరుకుగడలు, అనంతరాయని చెరువులో తామరపువ్వులు అవన్నీ జ్ఞప్తికొస్తాయి. అక్కడి మనుషులు కళ్లలో మెదిలినట్టే వుంటారు. ఎందులో ప్రయాణం చేస్తున్నా, ఎక్కడికి వెళ్ళినా నా చూపులు ఎవరికోసమో గాలిస్తున్నట్టుంటాయి. అంతెందుకు, రాజశేఖరం, ఈరోజు సాయంకాలం రోడ్డు పైన నువ్వు కనిపించేసరికి శేషాద్రి ఛాయలు నీలో కనిపించడంతో, నిజంగా ఆ శేషాద్రే వచ్చి నా ఎదుట నిల్చున్నాడేమోనన్న భ్రమ కలిగింది. నేను చదువుకున్నాను. ఉన్నతోద్యోగం చేశాను. డబ్బు సంపాదించాను, దేశాలు తిరిగాను. ఒక్క మాటలో చెప్పాలంటే లోకం మానవుడి కందివ్వగలిగిన సుఖాలన్నింటినీ చూరలాడాను. కానీ నా అంతరాంతరాల్లో దాగి ఉన్న ఒకే ఒక గాఢమైన ఆకాంక్ష వ్యక్తం చేయనా, రాజశేఖరం! కళ్లు మూసేలోగా... ఒకసారి చింతపల్లికి వచ్చి మన చింతలేటిలో ఒక చిన్న చెలమ తీసి, అందులోని తియ్యటి నీటిని కడుపునిండుకు తాగేయాలని వుంది, ఆ కోరిక నెరవేరుతుందో... నెరవేరదో..."

చింతపల్లికి కరెంటు వచ్చింది. ముందు కరెంటు వచ్చి వెనువెంటనే పంపుసెట్లు దిగాయి. కొత్తబావులు తవ్వారు. పాత బావుల్ని లోతుచేశారు. భూమితల్లి కడుపులోని అట్టడుగు ఊట దారుల్నిగూడా శోధించి పారేశారు! ఇప్పుడు చింతలేటిలో చెలమదీస్తే, అందులో ఇసకేగానీ నీళ్లూరవని అలనాటి అంజికీ తెలియదు, ఈనాటి దేవబంధుగారికీ తెలియదు!

♦ *ఆంధ్రప్రభ వారపత్రిక, **1967*** ♦